

శిథిలస్థితిలో మూతపడిన పాఠశాల భవనం

బడి భవనానికి మంత్రి లోకేశ్ హామీ

వీడియో ద్వారా చిన్నారులు చేసిన వినతికి స్పందన



ముమ్మిడివరం నగర పంచాయతీ అగ్రహారం బాడవలో శిథిలస్థితికి చేరిన పాఠశాల భవనం దుస్థితిపై విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పందించారు. అగ్రహారం బాడవలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనం మూడేళ్ల క్రితం శిథిలస్థితికి చేరడంతో ఉపాధ్యాయులు ప్రైవేటు భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. అక్కడే పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. ఇటీవల సదరు భవన యజమాని అద్దెంతరంగా ఖాళీ చేయాలని చెప్పడంతో ప్రస్తుతం పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నారు. దీనిపై విద్యార్థులు తమ బడి దుస్థితిపై వీడియో ద్వారా మంత్రి లోకేశ్‌కు విన్నవించుకున్నారు. అది ఆయనకు చేరడంతో స్పందించి అగ్రహారంలో పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సూచించారు. దీనిపై డీఈవో షేక్ మహబూబ్ బాషాతో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించి నివేదిక సమర్పించాలని సూచించారు. సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పాఠశాలకు వెళ్లి పరిశీలన అనంతరం అంచనాలు రూపొందించి కలెక్టర్‌కు సమర్పిస్తామని డీఈవో వివరించారు.

- న్యూస్‌టుడే, ముమ్మిడివరం

రూ.25 లక్షలు చెల్లిస్తేనే.. పీఠం

- ఖర్చు చేసి ఓడిన ఎంపీటీసీ అభ్యర్థికి ఇవ్వాలని షరతు
- పి.గన్నవరంలో కంగుతిన్న ఆశావహులు

పి.గన్నవరం, న్యూస్‌టుడే : పి.గన్నవరం మండలంలో ఎంపీపీ అధ్యక్ష పదవి డబ్బు చుట్టూ తిరుగుతోంది. కూటమిలోని ఓ పార్టీకి చెందిన నాయకుడు ఈ విషయంలో ఆశావహులకు ఇప్పటికే స్పష్టత ఇచ్చారు.

- మండలంలో ఓ ఎంపీటీసీ స్థానం నుంచి పోటీ చేసిన కూటమిలోని ఓ పార్టీ అభ్యర్థి ఓటమి చెందారు. ఆ అభ్యర్థికి గతంలోనే అధ్యక్ష పదవి ఇస్తామంటూ కొందరు నాయకులు భరోసా ఇచ్చారు. దీంతో ఆ అభ్యర్థి తనతో పాటు, పోటీలో ఉన్న మరికొందరు అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు కింద దాదాపు రూ.25 లక్షలు సమకూర్చినట్టు కార్యకర్తలు బాహాటంగా చర్చించుకుంటున్నారు.
- ఇప్పుడు ఆ అభ్యర్థి ఓటమి చెందడంతో, అధ్యక్ష పదవి ఆశించే వారు రూ.25 లక్షలు తీసుకొచ్చి ఓటమి చెందిన అభ్యర్థికి ఇవ్వాల్సి ఉంటుందని నాయకులు తేల్చి చెబుతున్నారు. దీంతో ఆశావహులు అంత డబ్బు ఎక్కడి నుంచి తీసుకురావాలంటూ తలలు పట్టుకుంటున్నారు.
- అసలు ముఖ్యనాయకుల్లో ఒకరు ఎన్నికలకు ముందే... ఆ అభ్యర్థికి అధ్యక్ష పదవి ఇస్తామని ఏకపక్షంగా భరోసా ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పార్టీలోని కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.
- ఇప్పుడు అభ్యర్థి ఓటమి చెందడంతో, అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న వారిని డబ్బులు తీసుకురావాలని చెప్పడం సరికాదని కూటమిలోని మరో ముఖ్యనాయకుడు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పి.గన్నవరం ఎంపీపీ అధ్యక్ష పీఠం ఎవరికి దక్కుతుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మలుపులో మరణశాసనం

ఈనాడు పరిశీలన

- 216 జాతీయ రహదారిపై ప్రమాదకర పరిస్థితులు
- నివారణ చర్యలు చేపట్టని యంత్రాంగం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం, అమలాపురం పట్టణం

రహదారుల్లో మలుపులు బెంబేలెత్తిస్తున్నాయి. సాధారణంగా జాతీయ రహదారి నిర్మాణ సమయంలో మలుపులు లేకుండా డిజైన్ చేయాలి. ఒక వేళ తప్పనిసరి పరిస్థితుల్లో మలుపు వస్తే 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు స్పష్టంగా కనిపించేలా నిర్మాణం చేపట్టాలి. జిల్లాలోని 216 రహదారి నిర్మాణ సమయంలో రాజకీయ పైరవీల కారణంగా ఇష్టానుసారం అలైన్‌మెంట్ మార్చేశారు.



అమలాపురం పేరూరు వై.జంక్షన్ వద్ద పరిస్థితి

- ఐ.పోలవరం మండలం ఎదుర్లంక నుంచి అనాతవరం వరకు రోడ్డు మలుపులమయంగా ఉంటుంది.
- కొమరగిరి, అన్నంపల్లి, నడిమిలంక, బొండాయకోడు, మహిపాలచెరువు, అనాతవరం ప్రాంతాల్లోని మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.
- అమలాపురంలోని పేరూరు వై.జంక్షన్‌లో ఈ ఏడాది మూడు ప్రమాదాలు జరిగాయి.
- ఎయిమ్స్ కళాశాల ప్రాంతంలోని వై.జంక్షన్, కాశీవారితూము కూడలి, కొండాలమ్మ చింత జంక్షన్, మూలతూము వై.జంక్షన్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. గత అయిదేళ్లలో ఈ ప్రాంతాల్లో 45 వరకు రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. 16 మంది మృత్యువాత పడ్డారు. 28 మంది క్షతగాత్రులయ్యారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో రహదారి ప్రమాదాలు ఇలా..

ఏడాది	మృతులు	క్షతగాత్రులు	కేసులు
2023	213	442	652
2024	185	400	552
2025	242	620	612
2026*	151	330	204

* ఈ ఏడాది అక్టోబరు వరకు..



నడిమిలంక వద్ద జాతీయ రహదారిపై ప్రమాదకర మలుపు

బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు..

- ముమ్మిడివరంలో నాలుగు, ఐ.పోలవరం మండలంలో 2 బ్లాక్ స్పాట్‌లు గుర్తించారు.
- అమలాపురం నుంచి ఎదుర్లంక వంతెన మధ్య ఐ.పోలవరం పోలీస్ స్టేషన్, ముమ్మిడివరంలోని కొండలమ్మ చింత, అనాతవరం, కామనగరువు ప్రాంతాల్లో పీటిని నిర్మించాలని పోలీసులు నివేదించారు.

చర్యలు తీసుకుంటున్నాం..

జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. జాతీయ, ప్రధాన రహదారుల్లో 18 బ్లాక్ స్పాట్లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాం. నాలుగు హైవే మొబైల్ వాహనాలతో 16 మంది సిబ్బందితో 24 గంటలు పర్యవేక్షణ ఏర్పాటు చేశాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

-రాహుల్‌మీనా, ఎస్పీ



ఆత్రేయపురం రేవులో..

ముప్పు ముంగిట ప్రయాణం

- బొబ్బర్లంక- రావులపాలెం రహదారిలోని బొబ్బర్లంక, ఆత్రేయపురం రేవు, లొల్లలాకులు, పేరవరం రేవు వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఆయా మలుపులలో జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు.
- లొల్ల- వాడపల్లి మార్గంలోని మలుపుల వద్ద వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. రాజవరం-పొదలాడ రోడ్డులోని తాడిపూడి, కట్టుంగ, వెలిచేరు, నార్కెడుమిల్లిపాలెం వద్ద మలుపులు ప్రమాదాన్ని సూచిస్తున్నాయి.
- అధికారులు స్పందించి... మలుపుల వద్ద రోడ్డు విస్తరణతో పాటు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ అంశంపై ర.భ.శాఖ డీఈ రాజేంద్రను వివరణ కోరగా.. పరిశీలించి సూచికలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. -న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ఏటా నష్టం.. అందని సాయం..!

ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

పి.గన్నవరం, న్యూస్‌టుడే

ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా తుపాన్ల సమయంలో ఇదే పరిస్థితి ఎదురవుతోందని, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేటికీ ఎదురుచూపులే..!

గత ఏడాది మొంథా తుపానుతో జిల్లాలో 72,323 ఎకరాల విస్తీర్ణంలో వరిపంట దెబ్బతినడంతో, 62,593 మంది రైతులు నష్టపోయారు. వారికి పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) కింద రూ.72.32 కోట్లు అందించాల్సి ఉంది. ఆ నివేదిక ప్రభుత్వానికి పంపి ఏడాది కావస్తున్నా... నేటికీ పరిహారం అందలేదని పలువురు రైతులు వాపోతున్నారు.

మళ్లీ ఎన్నాళ్లో..?

- అర్నబ్, మురసు తుపాన్ల కారణంగా జరిగిన నష్టానికి ప్రభుత్వం పరిహారం ఎప్పటికి మంజూరు చేస్తుందోనని బాధిత రైతులు అంటున్నారు.
- ఈ రెండు తుపాన్లతో జిల్లాలో 1.16 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరికి నష్టం వాటిల్లిందని, 66,342 మంది రైతులు నష్టపోయారని అధికారులు అంచనా వేశారు.
- ఈ ఏడాది సెప్టెంబరులో వచ్చిన అధిక వర్షాలకు జిల్లాలోని అయిదు మండలాల్లో 301 ఎకరాల వరి పంటకు నష్టం జరిగింది. 225 మంది బాధిత రైతులకు పెట్టుబడి రాయితీ రూ.20.51 లక్షలు అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆ పరిహారమూ ఇంకా అందలేదు.



అర్నబ్ తుపాను ధాటికి పి.గన్నవరంలో నేలనంటిన చేను

త్వరలో మంజూరు

గత ఏడాది మొంథా తుపాను, ఈ ఏడాది సెప్టెంబరులో వచ్చిన అధిక వర్షాల ప్రభావంతో నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి అందించాం. త్వరలో నష్టపరిహారం రైతులకు అందుతుంది. అర్నబ్, మురసు తుపాన్ల నష్ట వివరాలను ప్రభుత్వానికి పంపుతాం.

-ఎం.వెంకటరామారావు, జిల్లా వ్యవసాయాధికారి

1.09 లక్షల ఎకరాల్లో పంట నష్టం

ముమ్మిడివరం: అర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈనిక, గింజ గట్టిపడే దశలో ఉన్న వరి చేలు పడిపోవడంతో రైతులు పంటను పూర్తిగా నష్టపోయారు. జిల్లాలో 1.23 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. ఈ క్రాప్ ఆధారంగా ఏపీ ఎయిమ్స్ యాప్‌లో పంట నష్ట నమోదు చేశారు. 1,10,635 ఎకరాల్లో పంట నష్టం అంచనాలు వేయగా.. తుది పరిశీలనలో 1,09,595 ఎకరాల్లో వరి చేలకు నష్టం వాటిల్లినట్లు లెక్క తేల్చారు. ఈ వివరాలను కలెక్టర్‌కు నివేదించినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎంవీ రామారావు తెలిపారు.

ప్రాదేశికాల్లో వైద్యులు.. ఇంజినీర్లు

జడ్పీటీసీల్లో విద్యావంతులూ ఎక్కువే

ఈనాడు, అమలాపురం:

ప్రాదేశిక ఎన్నికల్లో విజయఢంకా మోగించిన సభ్యుల్లో ఈ దఫా ఉన్నత విద్యావంతులు అధికంగానే ఉన్నారు. వైద్యులు, ఇంజినీర్లతోపాటు ఎంబీఏ, ఎంసీఏ చేసినవారు పదవుల్లో కొలువు తీరి సమాజసేవ వైపు అడుగులు వేస్తున్నారు. మహిళల్లో గృహిణులు, హోమ్ మేకర్స్, జడ్పీ, మండల పరిషత్తులకు ఎన్నికైనవారిలో 22 ఏళ్ల యువత నుంచి 70 ఏళ్లు పైబడిన అనుభవశీలురు ఉన్నారు.

ఎంపీటీసీలు

పార్టీ	మహిళలు	పురుషులు	మొత్తం
తెదేపా	98	66	164
జనసేన	70	67	137
వైకాపా	22	21	43
భాజపా	1	4	5
ఇతరులు	8	15	23

వయసు	విజేతల సంఖ్య
21-35 ఏళ్లలోపు	64
36-55	268
56 ఏళ్ల పైబడి	40

(చొప్పెల్ల-3 నుంచి సింగంశెట్టి రమ్య, కొత్తపేట-2 నుంచి పాను పాటి చాందిని, పాలివెలు-1 నుంచి గంద్రోతు శ్రీసంధ్య 22 ఏళ్ల వయసులో ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నికయ్యారు.)



జిల్లాలో ఇలా..: ● 19 మంది జడ్పీటీసీల్లో 11 మంది మహిళలు. ● 31-40 ఏళ్ల వయసువారు నలుగురు, 41-50 మధ్యవారు 8 మంది, 51-60 మధ్య అయిదుగురు, 61 ఏళ్లు పైబడిన వారు ఇద్దరున్నారు. ● 8 మంది గృహిణులు. నలుగురు వ్యాపారం, అయిదుగురు వ్యవసాయం, ఒకరు ప్రైవేటు ఉద్యోగి, ఒకరు ప్రైవేటు విద్యాసంస్థ అధ్యక్షులు, ఒకరు వ్యవసాయ కూలీ.

డిగ్రీ, ఆపైన

● 20 మంది జడ్పీటీసీ సభ్యుల్లో అయిదుగురు డిగ్రీ ఆపైన విద్యార్హత కలిగి ఉన్నారు. మామిడికుదురు నుంచి గెలిచిన గొల్లపల్లి ద్రాక్షారామ-2 ఎంపీటీసీ మడక రాంబాబు వైద్య వృత్తిలో ఉన్నారు. ● అయినవిల్లి మండలం నుంచి అబ్బిరెడ్డి శ్రీవాణి, కుండలేశ్వరం నుంచి గెలిచిన రత్న కుమారి ఎంబీఏ చేశారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు, కాట్రేనికోన-3 ఎంపీటీసీ సభ్యులు వినీతదేవి, సుధాకర రావు బీటెక్ చదివారు. ● 6 నుంచి 10వ తరగతి విద్యార్హతతో 9 మంది, ఇంటర్ చదివినవారు ముగ్గురు ఉన్నారు. ఇద్దరు విద్యార్హత చూపలేదు.

విద్యార్హత	ఎంపీటీసీ విజేతలు
ప్రాథమిక విద్య	126
పదోతరగతి పాస్-ఫెయిల్	140
ఇంటర్	36
డిగ్రీ	47
పీజీ	11
డిప్లొమా	12

గృహిణులే ఎక్కువ..	
గృహిణులు, హోమ్‌మేకర్స్	185
వ్యవసాయం, అక్వా	106
మత్స్యకారులు	8
కార్మికులు, డ్రైవర్లు	41
వ్యాపారులు	28
ఉద్యోగులు, నిపుణులు	4

పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో పంచాయతీలకు రెండు విడతల్లో ఎన్నికలు పూర్తి చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 2,272 బ్యాలెట్ బాక్సులు, రెండో విడతకు 2,362 బ్యాలెట్ పెట్టెలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 4వేల పోలింగ్ కేంద్రాల పరిధిలో సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన 1,613 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పటిష్ఠ బందోబస్తు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ నిర్వహించాలని అధికారులకు సూచించారు. డీఆర్వో సుబ్బారావు, జిల్లా పరిషత్తు సీఈవో వసంతమాధవి, డీపీవో శాంతలక్ష్మి, ఆర్డీవోలు సరాదేవి, సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై గురి.. సర్వేతో సరి..!

- కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు
- అధికారులు పట్టించుకోవట్లేదని రైతుల ఆరోపణ

న్యూస్‌టుడే, మామిడికుదురు

కోనసీమ జిల్లాలో అటు వరిచేలు, ఇటు సమగ్ర రక్షిత మంచినీటి ప్రాజెక్టులకు జలాలను అందించే పంట కాలువలపై ఎక్కడికక్కడ ఆక్రమణలు పెరిగిపోవడంతో నీటి సరఫరాకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఏటా సార్వా, దాళ్వా పంటల కాలంలో నీటి ఎద్దడితో వ్యయప్రయాసలకు గురవుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆయకట్టు శివార్లలో...

- రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని జలవనరుల విభాగాల పరిధిలో సుమారు 48 వేల ఎకరాల రిజిస్టర్డ్ ఆయకట్టు ఉంది. ప్రధాన పంట కాలువ ఆధారంగా 88 వరకు ఉప ఛానల్స్ ఉన్నాయి. ● కాలువలను ఆనుకుని పలుచోట్ల దుకాణాలు, ఇళ్లు, ఇతర నిర్మాణాలతో ఆక్రమణలు శ్రుతిమించడంతో అస్తవ్యస్తంగా మారింది. ● చెత్తకుప్పలు, ఇతర వ్యర్థాలను కాలువల్లోనే వేయడంతో జలాలు కలుషితం అవుతున్నాయి. శివారు భూములకు నీరు సక్రమంగా అందడం లేదు.



తాటిపాక పంట కాలువను ఆనుకుని ఉన్న ఆక్రమణలు

కార్యాచరణ ఎప్పుడో..?

- ఆక్రమణలు తొలగించేందుకు రెండు నెలల కిందట జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. రాజోలు, తాటిపాక జలవనరుల విభాగాల పరిధిలో మొత్తం 2,100 ఆక్రమణలు గుర్తించారు.
- ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధికారులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం సమగ్ర వివరాలు నమోదు చేశారు. ఆయా ఆక్రమణలతో పాటు ఇష్టారీతిన నిర్మించిన వంతెనలు, కాలిబాటలు గుర్తించి... పూర్తిస్థాయిలో తొలగించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

■ రాజోలు, తాటిపాక, మామిడికుదురు, జగ్గన్నపేట, శివకోటి, మలికిపురం, సఖినేటిపల్లి, తదితర చోట్ల పంట కాలువ గట్లనే కాకుండా, కాలిబాటల పేరిట పలుచోట్ల నిర్మించిన వంతెనల వద్ద ఆక్రమణలు పెరిగాయి. ■ కొందరు వ్యక్తులు స్థానిక కాలువలపై విశాలంగా శ్లాబ్‌లు నిర్మించి.. దుకాణాలకు సంబంధించిన సామగ్రి ఉంచుతూ, ఇష్టానుసారంగా వ్యవహరించడంపై రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ■ ఎక్కడికక్కడ అనధికార నిర్మాణాలు ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆక్రమణలపై పూర్తిస్థాయిలో సర్వే చేసి, ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందించాం. ఇష్టారీతిన నిర్మించిన వంతెనపై పరిశీలన చేస్తాం. ఆక్రమణలు పూర్తిగా తొలగించే దిశగా కార్యాచరణ చేపడతాం.

-కొండలరావు, ఏఈఈ, జలవనరుల శాఖ

పల్లె పోరుకు సమాయత్తం...!

జిల్లాలో రెండు విడతల్లో ఎన్నికలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇప్పటికే పురపాలికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తయ్యాయి. స్థానిక సంస్థల్లో కీలకమైన పంచాయతీలకు ఎన్నిక నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో రెండు విడతల్లో 342 పంచాయతీలు, 3,878 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.



కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణకు హాజరైన అధికారులు

19 మండలాలు రెండు విడతలు..

జిల్లాలో రెండు విడతల్లోనే 342 పంచాయతీలకు ఎన్నికలు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మొదటి విడతలో అమలాపురం డివిజన్ పరిధిలోని 10 మండలాలు, రెండో విడతలో కొత్తపేట, రామచంద్రపురం డివిజన్లలో ఉన్న మండలాల్లో పంచాయతీలకు ఎన్నికలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

మొదటి విడత: సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం, కాట్రేనికోన, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో ఈ నెల 26న పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

రెండో విడత: పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు, ఆత్రేయపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో ఈ నెల 29న ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● పంచాయతీ ఎన్నికల్లో పార్టీల గుర్తులు ఉండవు.

రిజర్వేషన్లు ఖరారు..

జిల్లాలోని 342 పంచాయతీలు, 3,878 వార్డులకు ఇప్పటికే ఆధికారులు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే నిర్వహిస్తారు. సాయంత్రానికి ఫలితాలను ప్రకటిస్తారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

జిల్లాలోని 342 పంచాయతీలకు రెండు విడతల్లో ఎన్నికలు పూర్తి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశాం. దీని కోసం 4వేల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఈ నెల 13న ఎన్నికల సంఘం మొదటి విడత ఎన్నికలకు సంబంధించి ప్రకటన విడుదల చేస్తుంది.

-శాంత లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

నేటి నుంచి పది పరీక్షల రుసుము స్వీకరణ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 11 నుంచి 25వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ మహబూబ్ బాషా తెలిపారు. గడువు ముగిసిన తర్వాత రూ.50 అపరాధ రుసుముతో డిసెంబరు 2 వరకు, రూ.200తో డిసెంబరు 9, రూ.500తో 15 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులపై అపరాధ రుసుము భారం పడకుండా గడువులోగా ఫీజు చెల్లించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. యూడైస్ ప్లస్ వెబ్ సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలను నవీకరించాలని సూచించారు.

కెనరా బ్యాంక్ Canara Bank | ప్రాంతీయ కార్యాలయం కాకినాడ | బంగారు ఆభరణముల వేలం ప్రకటన

ఇ-వేలం ద్వారా బంగారు ఆభరణములు అమ్మకం
https://www.bankeauctions.com

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమేమనగా ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారులు, దిగువ తెలిపిన కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లలో బంగారు నగలు మీద ఋణము మరియు ఇతర ఋణములు పొంది యున్నారు. సదరు ఋణము యొక్క వడ్డీ బకాయిలు మరియు అసలు బకాయిలు చెల్లించవలసినదిగా బ్యాంకు వారు పలుమార్లు కోరినను వారు తమ బకాయిలు చెల్లించలేదు. ఇందుమూలంగా బంగారు నగలను https://www.bankeauctions.com ద్వారా 26.11.2026 వ తేదీన ఆన్‌లైన్ ఇ-వేలం వేసి వారి పేరున ఉన్న బకాయిలు జమకట్టుకొనబడును. ఈ దినమున పత్రికా ముఖంగా మరొకసారి వేలము నోటీసు తెలియజేయడమైనది. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరిత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు ప్రాయబడును. ఈ దిగువ ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

రావులపాలెం బ్రాంచ్ (2777), ఫోన్: 99082 88366
ధరావత్తు (ఇ.ఎం.డి) సొమ్ము జమచేయవలసిన అకౌంట్ నెం. 209272434, IFSC: CNRB0002777

నెం.	ఖాతా నెంబర్లు	ఖాతాదారుల పేర్లు మరియు చిరునామా	స్థూల బరువు
1	180448161152	తాడి శ్రీరామ చంద్రారెడ్డి, తండ్రి: తాడి బుల్లి అమ్మిరెడ్డి, 2-94, మహాలక్ష్మి గుడి వీధి, పి.బలంక, ఆత్రేయపురం, రావులపాలెం, తూర్పు గోదావరి జిల్లా, ఆం.ప్ర-533237.	35.8 గ్రా॥

వేలం నియమనిబంధనలు: (1) పై ఖాతాదారులలో ఎవరైనా మా బ్యాంకు నందు ఇంకనూ అప్పులు వున్నచో, వేలం ద్వారా మిగిలిన సొమ్మును ఆ ఖాతాకు సర్దుబాటు చేయబడును. (2) ఖాతాదారులు వేలం లోపు ఈ ఋణం చెల్లించి మీ బంగారు నగలను విడిపించుకోవాలని చివరగా మరొకసారి కోరడమైనది. లేని యెడల తేది 26.11.2026 గురువారం రోజున ప.॥ 12.00 గం.ల నుండి మ॥ 3.00 గం.ల వరకు https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం చేయబడును. (3) వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 25,000/- ధరావత్తు సొమ్మును తేది 25.11.2026 సా॥ 4 గం.లోపు పైన తెలిపిన సంబంధిత బ్రాంచ్ కలెక్షన్ అకౌంట్ నెం.కు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చును. (4) వేలంలో పాల్గొన్నవారు పై వస్తువుల విలువ పరిమాణము, నాణ్యత కొరకు ఎటువంటి వివాదములకు బ్యాంకు బాధ్యత వహించదు. (5) హెచ్చుపాటదారుడు మొత్తం పాట సొమ్మును అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను, లేనియెడల ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు. (6) జిఎస్‌టి మరియు ఇతర టాక్స్‌లు పాటదారుడే భరించవలెను. (7) ఏకారణం చూపకుండానే వేలం షరతులు మార్చుటకు, వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలిగియున్నవి. (8) మరిన్ని వివరములకు ఫోన్: 9948182222 సంప్రదించండి మరియు నవీకరించిన నియమనిబంధనల కొరకు https://www.bankeauctions.com చూడండి.

తేది: 11.11.2026, ప్రదేశం: కాకినాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

నీతిమంతుడు నిర్దోషిగా నడుచుకొనునప్పుడు; అతని తరువాత అతని సంతానం ధన్యులగుదురు
- సామెతలు 20:7



కీ॥శే॥ కమిడి జ్ఞాన ప్రకాష్ (జి.పి), IRS
7 ఏప్రిల్ 1961 - 11 అక్టోబర్ 2026

ప్రేమ, ఆప్యాయత, సేవాభావాలతో ఎన్నో జీవితాలను ప్రభావితం చేసిన మా ప్రియతములు
శ్రీ కమిడి జ్ఞాన ప్రకాష్ గారి పవిత్ర స్మృతికి హృదయపూర్వక నివాళులు.
వారి స్మారక ప్రార్థనా కార్యక్రమానికి విచ్చేసి, మీ ప్రార్థనలతో మమ్మల్ని ఆదరించవలసిందిగా సవినయంగా ఆహ్వానిస్తున్నాము...

11 నవంబర్ 2026 బుధవారం
ఉదయం 11.00 గం.లకు

స్థలం / వేదిక
యేసు ప్రేమాలయం సెంటినరి, బాప్టిస్ట్ చర్చి కాంపౌండ్, రామచంద్రాపురం, ఆంధ్రప్రదేశ్

కృతజ్ఞతలతో...
శ్రీమతి ప్రసన్న లత
శ్రీ వర్ష & వంశీ ఆండ్ర IAS | డా. రిషిక & ప్రశాంత్ IAS

(c) Internal eenadu